క్లుప్తంగా

తిరుమలాయపాలెంలో కార్గో సేవలు



కార్గో సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

తిరుమలాయపాలెం: టీఎస్ ఆర్టీసీ కార్గో, పార్శిల్ సర్వీస్ సేవలను మంగళవారం తిరుమలాయపాలెంలో డీఎంఈ వేణుగోపాల్, ఆర్ఎంఈ హరివర్మ ప్రారంభించారు. ఈ సేవలు బస్టాండ్‌కు సమీపంలోని మంజుల ఇంటర్‌నెట్ సెంటర్‌లో అందుబాటులో ఉంటాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు బత్తిని జగన్మోహన్‌రావు, అశోక్, పాదిల వెంకటేశ్వర్లు, వల్లోజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు దేవేందర్, శంకర్

కూసుమంచి: తెలంగాణ ప్రోగ్రెసివ్ ఫెడరేషన్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దేవేందర్, బాణోత్ శంకర్ ఎన్నికయ్యారు. మంగళవారం కూసుమంచిలో జరిగిన సమావేశంలో వారిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టకపోవటంతో విషయ నిపుణులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే షెడ్యూల్ విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉమాదేవి, మల్లయ్య, రాంకోటి, యాకయ్య, జ్యోతి, ఉపేందర్, బాబూరావు, భద్రూ, మదనాచారి, సేన్యా తదితరులు పాల్గొన్నారు.

ప్రియదర్శినిలో ప్రాంగణ నియామకాలు

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఢిల్లీకి చెందిన సోషియల్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మంగళవారం ప్రాంగణ నియామకాలు జరిగాయి. సంస్థ ప్రతినిధి రామన్‌గ్రోవర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలకు ఎంపికైన 15 మంది విద్యార్థినులు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థినులను కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు, ప్రిన్సిపాల్ బి.గోపాల్, అధ్యాపకులు అభినందించారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ట్యాంక్ బండ్‌పై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తో పాటు మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు విగ్రహాలు ఏర్పాటు చేయాలని జనసేన ఖమ్మం అసెంబ్లీ కోఆర్డినేటర్ మిరియాల నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి ఏర్పాటు చేయకపోతే పార్టీ తరఫున పోరాటం చేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	పీఎస్–2
వినోద	విరూపాక్ష
సాయిరాం	ఈవిల్ డెడ్ రైజ్
ఆదిత్య	ఏజెంట్
శ్రీనివాస	ఏజెంట్
సుందర్	విద్యార్థి

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	56		10
కాకర	50	చుక్కకూర	2
సొరకాయ	16		10
బీర	46	తోటకూర	2
దొండ	26		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	22		15
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	30		15
క్యాప్సికం	50	-ఖమ్మం వ్యవసాయం	

ధాన్యం.. దగా!

తరుగు, తాలు పేరుతో మిల్లర్ల దోపిడీ

- క్వింటాకు ఏడు కేజీలు తరుగు
- తప్పని పరిస్థితుల్లో అప్పగిస్తున్న రైతులు
- జిల్లా సరిహద్దుల్లోని సన్న రకాలు.. సూర్యాపేటకు తరలింపు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కొత్తకొత్తూరులో రైతుల నుంచి ఎగుమతి చేస్తున్న ధాన్యం

ఆరుగాలం పండించిన పంటలు కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఒక పక్క వాతావరణం ముంచెత్తుతుంటే.. మరో పక్క దళారులు కాసుకుని కూర్చున్నారు. ఇదే అదనుగా భావించిన మిల్లర్లు కొర్రీల పేరుతో దోచుకుంటున్నారు. తేమ శాతం బూచిని చూపి కొల్లగొడుతున్నారు. దిక్కులేని స్థితిలో రైతులు మిల్లులకు అప్పనంగా అప్పగిస్తున్నారు.

నేలకొండపల్లి మండలంలోని కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన రైతు ఆర్.వెంకటేశ్వర్లు ఎనిమిది ఎకరాల్లో వరి సాగు చేసి దాదాపు 560 బస్తాలు ఓ రైస్ మిల్లుకు తరలించారు. 20 శాతం తేమ ఉందనడంతో తిరిగి ఇంటికి తీసుకొచ్చి ఆరబెట్టారు. తరుగు పేరుతో కటింగ్ చేసే ధాన్యం చూస్తే పండించిన పంటలో ఎకరం పంట మిల్లర్లకు అప్పనంగా ఇవ్వాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు పండించిన పంటను కోత కోసిన తర్వాత వర్షానికి సగం నష్టం పోగా.. మిగిలిన సగం మిల్లర్ల ఇబ్బందులతో నష్టపోతున్నారు. యాసంగి ధాన్యం విక్రయాల్లో తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీకి తెర తీసి భారీగా సొమ్ము చేసుకుంటుండగా.. అధికారులు, పాలకులు ఆదిలోనే అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తుంటే కొంత మంది రైతులు నేరుగా తరలిస్తున్నారు. అక్కడ మిల్లర్లకు తరుగు, తాలు పేరుతో పెద్ద ఎత్తున కోత విధిస్తున్నారు. క్వింటాకు ఏడు కేజీల వరకు తగ్గిస్తున్నారు.

ఆరుగాలం కష్టం అప్పగింత..

కళ్లెదుట రైతు దగాకు గురవుతున్నా అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యయ, ప్రయాసలు పడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగా.. కాంటా వేసిన తర్వాత మిల్లర్ల వద్దకు వెళ్లగానే తరుగు పేరుతో గేటు వద్దే నిలబెడుతున్నారు. తరుగు ఇస్తేనే మిల్లుల్లో ధాన్యం దించుతామని తెగేసి చెబుతుండటంతో తప్పని పరిస్థితుల్లో రైతులు ఆరుగాలం కష్టాన్ని వారికి అప్పజెబుతున్నారు. సమస్యను అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించటం లేదని పలువురు రైతులు వాపోతున్నారు.

గిట్టుబాటు కాకనే..

జిల్లా సరిహద్దు గ్రామమైన అప్పలనరసింహాపురం రైతులు గిట్టుబాటు ధర లేకపోవడంతో వారు పండించిన సన్నాలను సూర్యాపేట మార్కెట్‌కు ధాన్యాన్ని తరలిస్తున్నారు. అక్కడ క్వింటా రూ.2,200 వరకు ధర పొందుతుండటంతో రైతులు లారీ లోడు ధాన్యం కాగానే తరలిస్తున్నారు.



అప్పలనరసింహాపురంలో ధాన్యాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్న రైతులు

వ్యవసాయం మానేయడం మంచిది..



ఇన్ని ఇబ్బందులు పడి వ్యవసాయం చేయటం కన్నా.. మానేయడం మంచిది. నేను ఎనిమిది ఎకరాల్లో వరి సాగు చేశా. తరుగుకు కనీసం ఎకరం పంటను అప్పనంగా ఇవ్వాల్సి వస్తోంది. ప్రభుత్వ అధికారులు రైతుల గోడు వినిపించుకోవాలి.

– ఆర్.వెంకటేశ్వర్లు, కొత్తకొత్తూరు, రైతు

తడిసిన ధాన్యాన్ని కొనాలి..



అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని నిబంధనలు సడలించి వెంటనే కొనాలి. కాంటాలు వేసిన బస్తాలకు లారీలను ఏర్పాటు చేసి ఎగుమతులు శరవేగంగా చేపట్టాలి. ఇకనుంచైనా రైతులను ఇబ్బంది పెట్టకుండా కొనుగోళ్లు చేపట్టాలి. లేకుంటే సహించం.

– బచ్చలకూరి నాగరాజు, కోరట్లగూడెం, రైతు

కొర్రీలపై దృష్టి సారించాలి..



రైతులను ఒక పక్క వాతావరణం, మరో పక్క మిల్లర్లు ఇబ్బందులు పెడుతుంటే.. అధికారులు మాత్రం స్పందించటం లేదు. మిల్లర్ల కొర్రీలపై ప్రత్యేక అధికారులను నియమించి తరుగు తీయకుండా చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఉద్యమం చేస్తాం.

– జి.నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకుడు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం కేసీఆర్, మంత్రి పువ్వాడ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మేయర్, కార్మికులు

ఖమ్మంమయూరిసెంటర్: పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పెంచుతున్నట్లు ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు ఖమ్మంలోని మంత్రి పువ్వాడ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎంతో పాటు మంత్రి పువ్వాడ చిత్రపటాలకు బీఆర్‌టీయూ నాయకులు పాలాభిషేకం చేశారు. వేతనాల పెంపుతో సీఎం కేసీఆర్ కార్మికుల పక్షపాతి అని మరోసారి రుజువైందని తెలిపారు. మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజుతో పాటు పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన..

నగరంలోని 34, 36వ డివిజన్‌లలో రూ.40 లక్షల సుడా నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌లు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..మున్సిపల్ సాధారణ నిధులతో పాటు సుడా నిధులను అభివృద్ధి పనులకు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రుద్రగాని శ్రీదేవి, పసుమర్తి రామ్మోహన్‌రావు, నాయకులు రుద్రగాని ఉపేందర్, కొత్త వెంకటేశ్వర్లు, వసంత్‌బాబు, ఏఈ శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ధరలకు అనుగుణంగా వేతనం ఇవ్వాలి..

ఖమ్మంమయూరిసెంటర్: మున్సిపల్, గ్రామపంచాయతీల్లోని పారిశుద్ధ్య కార్మికుల వేతనాన్ని కేవలం రూ.వెయ్యి పెంచడం సరికాదని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) అధ్యక్షుడు జి.రామయ్య పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాన్ని అమలుచేయాలని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

గంగబండతండాలో బొడ్రాయి ప్రతిష్ఠ

కూసుమంచి: మండలంలోని గంగబండతండాలో మంగళవారం బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవాన్ని వేద మంత్రోచ్చరణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తండావాసులు బొడ్రాయికి జలాభిషేకం చేసి పూజలు చేశారు. దీంతో తండాలో పండుగ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ కిషన్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, జెడ్పీటీసీ ఇంటూరి బేబీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వేముల వీరయ్య, మల్లీడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గోల్‌తండాలో ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠా ఉత్సవాలు

తిరుమలాయపాలెం: మండలంలోని గోల్‌తండాలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రతిష్ఠ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించగా.. వేదపండితులు హోమాలు చేశారు. బుధవారం ప్రతిష్ఠ కార్యక్రమానికి పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరుకానున్నారు.

స్తంభాద్రి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో వార్షిక పంచాహ్నిక బ్రహ్మోత్సవ, శ్రీ సుదర్శన యాగ, కల్యాణ మహోత్సవాలు మంగళవారం ఉదయం మంగళవాయిద్యాలతో ప్రారంభమయ్యాయి. పూజా కార్యక్రమాలను ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి పర్యవేక్షణలో అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు.

ఉత్సాహంగా అష్టావధానం



సాహిత్యాన్ని వినిపిస్తున్న బోరెల్లి హర్ష తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: భావనా ప్రియ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని నిర్మల హృదయ్ పాఠశాలలో మంగళవారం సాయంత్రం అష్టావధాన కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో అష్టావధాని డాక్టర్ బోరెల్లి హర్ష మాట్లాడారు.కార్యక్రమంలో గురుసహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్, కంది శంకరయ్య, అష్టవధాని చిట్టితోటి విజయ్‌కుమార్, హెచ్‌వీఎల్ ప్రసాద్‌బాబు, పరాశరం ప్రసాద్, యలగందుల సుచరిత, మార్షియానా, రేవుల శ్రీనివాస్‌రావు, ఎన్‌సీహెచ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలపర్తి హవీలా, విద్యాసాగర్‌లకు చిట్టితోటి విజయ్‌కుమార్ చేతుల మీదుగా భారతి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తులసీదాస్, మోదుగు గోవింద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు మంజూరు చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: అర్హులైన వారందరికీ కొత్త తెల్లరేషన్ కార్డులు మంజూరు చేయాలని పీఓడబ్ల్యూ, పీవైఎల్ సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు చల్లగుండ్ల శిరోమణి, రాకేష్ మాట్లాడుతూ అర్హులైన వారికి కార్డులు మంజూరు చేయడమే కాక అదనపు పేర్లు చేర్చాలని, రేషన్ దుకాణాల ద్వారా గోధుమలు, పంచదార, పప్పు, నూనె తదితర సరుకులు పంపిణీ చేయాలని కోరారు. నాయకులు లలిత, మంగతాయి, శీలం పుల్లమ్మ, బందెల లలిత, చందు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని టేకులపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని టేకులపల్లి ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టేకులపల్లి, చైతన్యనగర్, సుందరయ్యనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఆరోగ్య మహిళా క్యాంపు సందర్శన



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

కామేపల్లి (కారేపల్లి): కామేపల్లి పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా క్యాంపును డిప్యూటీ డీఎంహెచ్ఓ రాంబాబు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహిళల ఆరోగ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ క్యాంపు ద్వారా మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, ఉమెన్ స్పెషల్ క్లినిక్‌లలో శస్త్ర చికిత్స నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్.చందన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భట్టి పాదయాత్రలో మండల నాయకులు



భట్టితో మండల నాయకులు

నేలకొండపల్లి: భువనగిరి యాదాద్రి జిల్లాలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో మంగళవారం టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, శంకరగిరితండా మాజీ సర్పంచ్ బాబు, నాయకులు చిట్లా సైదారెడ్డి, యడవల్లి నాగరాజు, పెద్దపాక ముత్తయ్య, విజయ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

28న నగర విశ్వబ్రాహ్మణ ఎన్నికలు



మాట్లాడుతున్న విజయగిరి సదానందచారి

ఖమ్మం మామిళ్లగూడెం: నగర విశ్వబ్రాహ్మణ సంఘ ఎన్నికలు ఈ నెల 28 నిర్వహించనున్నట్లు తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ఆహ్వాన సంఘం చైర్మన్ విజయగిరి సదానందచారి తెలిపారు. మంగళవారం గాంధీచౌక్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించే ఈ ఎన్నికలకు ఈ నెల 6 నుంచి 8 వరకు నామినేషన్లు, 9న నామినేషన్‌ల పరిశీలన, 10న మధ్యాహ్నం 12గంటల వరకు ఉపసంహరణ ఉంటుందన్నారు. నగరంలోని 60 డివిజన్‌లలో 18ఏళ్లు నిండిన వారికి తమ సభ్యత్వ నమోదు ఉచితంగా నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరావు, ప్రధాన కార్యదర్శి మామిళ్లపల్లి నాగేశ్వరావు, కోశాధికారి కోటగిరి నాగేశ్వరావు, సహాయకార్యదర్శి నాగరాజు, రాజేశ్వరావు, ఎన్నికల ప్రధాన అధికారి పాపాచారి, సువర్ణ ప్రసాద్, సత్యనారాయణ, దాసురోజు రవి తదితరులు పాల్గొన్నారు.

చిమ్మపుడి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు..



పూజలు చేస్తున్న అర్చకులు

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడి శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాలయ ప్రధాన అర్చకుడు మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో అధ్యానోవత్సవ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిపినట్లు అర్చకులు తెలిపారు.

పాలేరులో ఎర్రజెండా ఎగరడం ఖాయం

నేలకొండపల్లి: పాలేరులో ఎర్రజెండా ఎగరడం ఖాయమని సీపీఎం కోరట్లగూడెం జోన్ కన్వీనర్ పగిడికత్తుల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని కోనాయిగూడెంలో నిర్వహించిన జోన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం ప్రజల సమస్యల కోసం పోరాడే ఎర్రజెండా పాలేరులో ఎగురుతుందని అన్నారు. దేశం, రాష్ట్రంలో బీజేపీ ఆధిపత్యాన్ని నిలువరించేందుకు, ప్రజాస్వామ్యం, మత సామరస్యాన్ని కాపాడేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు బండి రామ్మూర్తి, బొయినపల్లి కొండలరావు, మీగడ లింగరాజు, మారుతి గోవింద్, అమర బోయిన భిక్షం, గురజాల ఉపేందర్, గాదె వెంకటేశ్వర్లు, హరిప్రసాద్, బొడ్డు ఆంజనేయులు, కోటేశ్వరరావు, రమణ, వాసంశెట్టి నరసయ్య పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరిన నిరసన దీక్షలు



రఘునాథపాలెం: దీక్ష చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు



కూసుమంచి: సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



నేలకొండపల్లి: సంఘీభావం ప్రకటిస్తున్న సీపీఎం నాయకులు

రఘునాథపాలెం/కూసుమంచి/నేలకొండపల్లి: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తలపెట్టిన నిరసన దీక్షలు మంగళవారం ఐదో రోజుకు చేరాయి. రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ప్లకార్డులు చేతపట్టి తమను క్రమబద్ధీకరణ చేయాలని తదితర నినాదాలు చేశారు. అలాగే కూసుమంచిలో చేపట్టిన దీక్షకు కాంగ్రెస్ నాయకులు, నేలకొండపల్లిలో సీపీఎం నాయకులు సంఘీభావం ప్రకటించి పంచాయతీ కార్యదర్శుల డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. కూసుమంచి దీక్షలో సంఘీభావం తెలిపిన వారిలో ఎంపీటీసీ సుజాత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండీ హఫీజుద్దీన్, నాయకులు శరత్, వెంకన్న, అంజయ్య తదితరులు పాల్గొనగా.. నేలకొండపల్లిలో సీపీఎం పాలేరు డివిజన్ నాయకుడు ఏటుకూరి రామారావు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఉపేందర్, శ్రీకాంత్, మనోహర్, రమేష్, బొడ్డు బాబురావు తదితరులతో పాటు వివిధ పార్టీల నాయకులు దీక్షకు మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు.

సామాజిక సేవారంగంలో డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నాగరాజు

ఖమ్మంగాంధీచౌక్: విద్య, వైద్య రంగాల్లో పేదలకు సేవలందించిన ఖమ్మంకు చెందిన తురక నాగరాజుకు డాక్టరేట్ లభించింది. తమిళనాడులోని ఏసియన్ ఇంటర్ నేషనల్ కౌన్సిల్ రీసెర్చ్ యూనివర్సిటీ ప్రకటించిన ఈ డాక్టరేట్‌ను డాక్టర్ మొనకరన్, శర్మ, స్వామీజీ, కన్నడ డైరెక్టర్ మీనా కాశి తదితరులు ఆయనకు అందజేసి సన్మానించారు.

అటెన్షన్ ప్లీజ్

పాదరక్షలకు రక్షణ ఏదీ?

ఈ ఫొటోలో కనిపిస్తున్న వందలాది పాదరక్షలను చూసి ఇక్కడేదో తొక్కిసలాట జరిగిందని అనుకుంటే పొరబడినట్లే. ఇది ఖమ్మం మాతా శిశు సంరక్షణ కేంద్రం ఆవరణలో నిత్యం కనిపిస్తున్న దృశ్యం. ఈ కేంద్రంలో చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేకంగా వైద్య సేవలు అందిస్తుండటంతో వారికి ఇన్‌ఫెక్షన్ సోకకుండా ఆస్పత్రిలోకి చెప్పులు వేసుకొని వెళ్లడం నిషేధించారు. దీంతో వైద్య సేవలకు వచ్చిన రోగులు, సహాయకులు వాటిని బయట విడిచి లోపలికి వెళ్తుంటారు. ఆ తర్వాత తిరిగి వచ్చి వారివారి చెప్పులు వెతుక్కోవాలంటే ఓ యుద్ధం చేసినట్లే అవుతుంది. ఒక్కోసారి ఒకరి చెప్పులు మరొకరు వేసుకొని వెళ్తున్నారు. వీరి ఇబ్బందులకు దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు చెప్పుల స్టాండ్ ఏర్పాటు చేసి రక్షణగా సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

- ఖమ్మం వైద్యవిభాగం

